ప్రజాశక్తి
బుధవారం 5 జులై 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వెంకాయమ్మ బంధువులు

కుటుంబాన్ని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి

రేకులషెడ్డును కూల్చేశారు.!

- అద్దంకిలో అధికార పార్టీ నేతల అరాచకం..
- రహదారి కోసమంటూ అధికార బలంతో ఓ మహిళ స్థలం స్వాధీనం
- వేధింపులు తట్టుకోలేక పోలీసుస్టేషన్ ఎదుట బాధితురాలు ఆత్మహత్యాయత్నం



వెంకాయమ్మకు ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అద్దంకి, బాపట్ల జిల్లా

టిడిపి సానుభూతిరాలిగా ఉన్న ఓ మహిళ స్థలంపై అధికారపార్టీ నేతలు కన్నేశారు. గతంలో రోడ్డు విస్తరణ పేరుతో ఆమె ఇంటి ముందుభాగాన్ని తొలగించారు. ప్రస్తుతం ఎలాగైనా ఆ స్థలంలో ఆమె కుటుంబాన్ని లేకుండా చేయాలని కుట్ర పన్నారు. అధికారపార్టీ నేతల ఆదేశాల మేరకు పోలీసులు ఆమెతో పాటు ఆ కుటుంబాన్ని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. వీళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సమయంలోనే అధికారపార్టీ నేతలు ఆ కుటుంబం ఉండే రేకులషెడ్డు, పశువుల కొష్టాన్నీ తొలగించి.. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితురాలు భరించలేక.. పోలీస్‌స్టేషన్ ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు.

బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన తిరుపతి వెంకాయమ్మ కుటుంబం తెలుగు దేశం పార్టీ సానుభూతిపరులుగా ఉన్నారు. గ్రామానికి చెందిన స్థానిక వైసిపి నేతలు అక్కడ రహదారి విస్తరణ పేరుతో ▶ 2లో

టమోటా @100

- బహిరంగ మార్కెట్‌లో రూ.120
- రోజురోజుకీ పెరుగుతున్న ధరలు
- ప్రత్యామ్నాయ చర్యల దిశగా ప్రభుత్వం
- సబ్సిడీ టమోటా కిలో రూ.50
- నిరంతరాయంగా సరఫరా చేయాలని కోరుతున్న ప్రజలు



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టమోటా ధరలు పైపైకి వెళుతున్నాయి. గత పది రోజుల వ్యవధిలో 50 శాతానికి పైగా టమోటా ధరలు పెరగటం ఇందుకు నిదర్శనం. మొన్నటివరకు రూ.60 ఉన్న టమోటా ధర నేడు రైతు బజార్‌లో 100 రూపాయలు పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.120కు వ్యాపారులు విక్రయిస్తున్నారు. టమోటా ధరలు పెరగటంతో ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతుబజార్లలో ప్రభుత్వం సబ్సిడీకి కిలో టమోటా రూ.50కు విక్రయిస్తోంది. అవసరమైన టమోటా నిరంతరాయంగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టమోటా ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. జిల్లాకు అవసరమైన టమోటాలు చిత్తూరు జిల్లా మదనపల్లి, పలమనేరు నుంచి సరఫరా అవుతుంటాయి. ఇటీవల కాలంలో మదనపల్లి, పలమనేరు ప్రాంతాలలో కురిసిన అకాల వర్షాలకు టమోటా తోటలు తీవ్రంగా నష్టపోయాయి. దీంతో రైతులు టమోటా పంటను సాగు చేసి పంట చేతికి రావటానికి నెల రోజుల సమయం పడుతోంది. దీంతో టమోటా ధరలు పెరిగిపోతున్నాయి. మరో నెల రోజులు ఇవే ధరలు కొనసాగుతాయని హెూల్‌సేల్, రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. ఒంగోలుకి రోజుకి 60 టన్నుల టమోటాల వినియోగం జరుగుతుంది. హెూటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, గృహ వినియోగానికి వీటిని ఉపయోగిస్తుంటారు. జిల్లావ్యాప్తంగా రోజుకి 100 నుంచి 120 టన్నుల టమోటాలు సరఫరా జరుగుతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలకు శ్రీకారం

టమోటా ధరలు అమాంతం పెరగటంతో ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కిలో టమోటాను సబ్సిడీకి రూ.50కే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి సబ్సిడీ టమోటాలను విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన ఒంగోలులోని మూడు రైతు బజార్లకు 5000 కిలోల టమోటాలను సరఫరా చేసింది. ఒక్కో రైతు బజార్‌కి 1500 కిలోలు పంపిణీ చేసింది. కేవలం రోజున్నరలో టమోటాలు మొత్తం అయిపోయాయి. టమోటాలను నిరంతరా యంగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

లోపాలు లేకుండా ఓటర్ల జాబితా

- ఓట్ల పరిశీలనలో వాలంటీర్లను భాగస్వాములు చేయొద్దు
- అధికారులకు కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం

▲ 8లో



అల్లూరికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

అల్లూరి సీతారామరాజును

స్ఫూర్తిగా తీసుకోవాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మన్యం వీరుడైన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. అల్లూరి సీతారామరాజు 126వ జయంతి కార్యక్రమం జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ▶ 2లో

రేకులషెడ్డును కూల్చేశారు.!

(మొదటిపేజీ తరువాయి)

గతంలోనే వెంకాయమ్మ కుటుంబానికి చెందిన ఇంటి ముందు భాగాన్ని తొలగించారు. గత కొంతకాలంగా మొత్తం స్థలంపై కన్నేసిన వైసిపి నేతలు పోలీసుల ద్వారా వారిని సదరు స్థలం నుంచి పంపించే చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు ఇప్పించి సదరు స్థలం ఖాళీ చేయించే ప్రయత్నాలు చేశారు. ఈ విషయమై స్థానిక నేతలు వెంకాయమ్మ కుటుంబంపై దౌర్జన్యం చేయడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వెంకాయమ్మ కుటుంబసభ్యులు న్యాయం కోసం రెవెన్యూ, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం అద్దంకి పోలీసులు వెంకాయమ్మ కుటుంబసభ్యులందరినీ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే నిర్బంధించారు. వీరు ఇక్కడ ఉండగా.. అధికారపార్టీ నేతలు వెంకాయమ్మ స్థలంలో ఉన్న రేకులషెడ్డు, గేదెల కొష్టం, గడ్డివాములను ప్రొక్లయినర్‌తో తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. పొద్దుపోయాక విషయం తెలుసుకున్న వెంకాయమ్మ మనస్థాపంతో పోలీస్‌స్టేషన్ ముందే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది.

వేధింపులు తట్టుకోలేకే..

అధికారపార్టీ నాయకులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేకే తమ తల్లి పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్యకు యత్నించినట్లు ఆమె కుమార్తె తెలిపారు. అధికార పార్టీ నాయకులు మంగళవారం ఉదయం నుంచి తమకు చెందిన ఇంటిని, కొస్టాన్ని 20 మందితో వచ్చి బలవంతంగా తొలగించే ప్రయత్నం చేశారని చెప్పారు. తమని ఆడవాళ్లమని కూడా చూడకుండా బయటకు నెట్టి ఖాళీ చేయించారని అన్నారు. తమని అద్దంకి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించారని అన్నారు. తమని ఎందుకు పోలీస్‌స్టేషన్‌కు పిలిపిస్తున్నారని ఎస్ఐను పదేపదే ప్రశ్నించడంతో సిఐ ఆదేశాల మేరకు మిమ్మల్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిపారని చెప్పారు. బాధితురాలు వెంకాయమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అల్లూరి సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా రెవెన్యూ అధికారిని కె.లక్ష్మీశివజ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిణి జె.రాజదిబోరా, కలెక్టరేట్ ఏవో కె.గోపికష్ణ పుష్ప మాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిఎం శ్రీలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని జిల్లెలపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పెనుమాల గురవమ్మ (100) మంగళవారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వరిలో ఆదినారాయణ, చిన్నమాల కొండయ్య, గోపాల్, లక్ష్మీ నారాయణ, ఎర్రగుంట్ల బ్రహ్మయ్య, మాచర్ల తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి- నాగులులప్పలపాడు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఎంఇఒ లు రవి, ఇవి రమణయ్య తెలిపారు. మండల పరిధిలోని నిడమానూరు గ్రామంలోనున్న నాలుగు పాఠశాలలను మంగళవారం సందర్శించారు ఈ సందర్భంగా మధ్నాహ్న భోజనం, నాడు-నేడు పథకాలను పరిశీలించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక నిలిపివేత

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో 2022-23 సంవత్సరంలో ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్వహించిన 872 పనులకు రూ.15,69,63000 నగదు కూలీల ఖాతాలలో జగమచేశారు. ఈ పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎస్ఆర్‌పి సుబ్బారావు బేస్తవారిపేట, శింగరాయకొండ, కంభం మండలాలకు సామాజిక తనిఖీ బృందం ఉపాధిహామీ సిబ్బంది వద్ద నగదు తీసుకొని అంతా బాగుందని సర్టిపై చేశారు. ముండ్లమూరు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు డబ్బులు ఇవ్వకపోవడంతో రూ.5 కోట్ల మేర పనులు జరగగా అందులో రూ.10 కోట్ల మేర అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజా వేదిక సందర్భంగా పీడీ శీనారెడ్డికి తెలిపారు. అయితే ఉపాధి కూలీలు, సిపిఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జరిగినట్లుగానే ముండ్లమూరు మండలంలో పనులు జరిగాయని తెలిపారు. బేస్తవారిపేట ,శింగరాయకొండ, కంభం మండలాల్లో రీ ఆడిట్ నిర్వహించి ముండ్లమూరు మండలంలోనూ రీ ఆడిట్ జరపాలని చాట్ డైరెక్టర్ జగదీష్‌కుమార్‌ను కోరారు. దీంతో సామాజిక తనిఖీ ప్రజా వేధిక అర్థాంతరంగా నిలిపివేశారు. తొలుత దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో అన్నీ మండలాల్లో జరిగినట్లుగానే ముండ్లమూరులో ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు తెలిపారు. చెరువులు పూడికతీత, నాడు-నేడు, రోడ్లు, చెక్‌డ్యామ్ పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. రైతులకు మొక్కలు అందజేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా అధికారులు నిష్పక్షపాతంగా ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బివిఒ ఝాన్సీ , ఏపీడీ పద్మశ్రీ, ఎంపిపి సుంకరసునీత బ్రహ్మానందరెడ్డి, తహశీల్దారు నయీమ్ అహ్మద్, ఎంపిడిఒ కుసుమ కుమారి,ఎపిఒ కొండయ్య, ఇసి,బిఎలు, ఎస్ఎలు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు, కూలీలు

తాగునీటి సమస్య పరిష్కారానికి హామీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలో మేదర సంఘం వాసులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు తమ సమస్య గురించి 4వ వార్డు సభ్యుడు పడిదపు రవికుమార్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన రవికుమార్ సమస్యను సర్పంచి తాడిపర్తి వనజా దృష్టికి తీసుకెళ్లాడు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యంను కోరారు. దీంతో స్పందించిన కార్యదర్శి మంగళవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యపై మహిళలతో చర్చించారు. రూరల్, అర్బన్ పథకం ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కులాయిలు ఇచ్చినప్పటికీ ఆ ప్రాంతంలో మంచినీరు రాకపోవడం లేదని మహిళలు తెలిపారు. రోడ్డు దాటి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని దీంతో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. 10 రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని కార్యదర్శి మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిల్‌కలెక్టర్ రామయ్య, సుధాకర్ పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న కార్యదర్శి

గ్రామాభివృద్ధికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి నలమలపు అంజమ్మ తెలిపారు. మండలపరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన, కొత్తగా నియమితులైన కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వ హించారు ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలు, పలు అంశాలపై చర్చించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులపై ఉపాధి సిబ్బందితో చర్చించారు. అనంతరం నూతన కార్యదర్శులు ఎంపిపి, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిని పరిచయం చేసుకొని శాలువతో సన్మానించారు ఈకార్యక్రమంలో ఎపిడిఒ జయమణి,ఇఒపిఆర్‌డి బివివి. కుమారి, కష్ణారెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితనేలే పాల్గొన్నారు.



ఎంపిపి, ఎంపిడిఒను సన్మానిస్తున్న కార్యదర్శులు

మురుగు కాలువలు నిర్మించాలని

కమిషనర్‌కు వినతి

గిద్దలూరు : గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని 2వ వార్డు రాజానగర్‌లో మురుగు కాలువలు నిర్మించాలని కోరుతూ నగర పంచాయతీ కమిషనర్‌కు ఆవార్డు కౌన్సిలర్ బి. చంద్రశేఖర్ యాదవ్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం రెండో వార్డులో మురుగుకాలువలు నిర్మించాలని కౌన్సిల్ తీర్మానం చేసినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు తెలిపాడు. అయిన ప్పటికీ నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. అధికారులు స్పందించిన కాలువలు నిర్మించాలని ఆయన కోరారు.

6నుంచి జగనన్న సురక్ష

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఈశ్వరమ్మ తెలిపారు. ఈ నెల 5న కోయిలంపాడు, నల్లమడుగుల, 7న ఉప్పలపాడు, డిజి పేట, 10న బోయమడుగుల, అరివేముల, 12న ఏ కొత్తపల్లి, రేగులచెలక, 14న సిఎస్ పురం, 17న చెన్నపు నయునిపల్లి సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్ల ఆమె తెలిపారు. ఈ సందర్భ:గా ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యాయవాదుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-చీరాల

న్యాయవాదులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని భారత న్యాయవాదుల సంఘం (ఐఎఎల్) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా చీరాల న్యాయస్థాన ప్రాంగణం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూదరాజు శశి కిరణ్ మాట్లాడుతూ ఎంతోకాలంగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న న్యాయవాదుల అన్ని రకాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో భాగంగా చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసనలో పాల్గొనడం జరిగిందన్నారు. ప్రధానంగా న్యాయవాదుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టం కావాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్ రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని

న్యాయదేవతకు వినతిపత్రం అందజేత



కోర్టు ప్రాంగణంలో నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

కోరారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.30 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నదని అన్నారు. చనిపోయిన న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌కు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.30 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉందని, న్యాయ నేస్తం ప్రతి నెల ఖచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరి హక్కుల రక్షణకు పాటుపడే న్యాయవాదులు నేడు తమ హక్కులను రక్షించుకోవడానికి నిరసన చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరసన తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. ఈ నిరసనలో భాగంగా న్యాయదేవతకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎంవి చలపతి రావు, ఉదయ్ భాస్కర్, ఐఎఎల్ పట్టణ అధ్యక్షులు కరవది భాను ప్రకాష్, చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ బాబు, ఉపాధ్యక్షులు శ్రీమతి పి విజయలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి మేరుగ రవి కుమార్, వర్కింగ్ సెక్రటరీ మొపూరి తారక రామారావు, జె శ్రీనాథ్ మంకేన అశోక్ కుమార్, మహిళా న్యాయవాదులు శ్రీమతి శకుంతల, శ్రీమతి కొండమ్మ, గౌతమి, టివి శైలజ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు



మృతిచెందిన వెంకటేశ్వరవర్మ

లారీ ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన నాగులుప్పల పాడు ఇంకొల్లు మలుపు వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు ఒంగోలు గోపాలనగర్ 5వ లైనుకు చెందిన కలం వెంకటేశ్వరవర్మ ద్విచక్ర వాహనంపై ఇంకొల్లు పని మీద వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా నాగులుప్పల పాడులోని కోకిల కోల్డ్ స్టోరేజ్ వద్ద ఇంకొల్లు రోడ్డులో నుంచి ఒంగోలు రోడ్డులోకి వస్తుండగా ఒంగోలు నుంచి చీరాల వెళుతున్న హీరో కంపెనీకి చెందిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వెంకటేశ్వరవర్మ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ హరిబాబు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఒంగోలు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్

మహిళలపై వేధింపులను అడ్డుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి: రోజు రోజుకూ మహిళలపై పెరిగిపోతున్న లైంగిక వేధింపుల నిరోధానికి తగిన చర్యలు తీసుకోవా లని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనం లో ఐద్వా జిల్లా శిక్షణా తరగతులు ఎస్‌డి షర్మిల అధ్యక్షతన జరిగాయి. సంస్కరణలు మహిళలపై ప్రభావం అనే అంశంపై ఆయన మాట్లాడారు. మహిళలపై దాడులు పెరిగి రక్షణ కరువు కావ టానికి పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. సమానత్వం కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన అన్నారు. మద్యపాన నిషేధం కోసం, ధరల తగ్గింపు కోసం మహిళలు ఐక్యంగా రాబోయే కాలంలో పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు మద్యపాన నిషేధానికి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఎన్నికల్లో గెలిచాక ఆ హామీని అటకెక్కించారన్నారు. ఫలితంగా మహిళలకు ఇబ్బందులు తప్పటంలేదన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా నాయకులు ఎస్‌కె బషీర, సిఐటియు జిల్లా కార్యదర్శి పిసి కేశవరావు, మహిళా నాయకురాళ్లు కె ప్రసన్న, భానుమతి, ఎస్‌కె ఖాదర్‌మున్నీసాలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్



తాగునీటి వసతిని పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్

పాఠశాల యాజమాన్యం ఆ పాఠశాల పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని నారాయణ టెక్నో స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని, అలాగే మలమూత్ర విసర్జనశాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, వాటిని ఫినాయిల్‌తో శుభ్రపరిచి కలరా ఉండలు వేసుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. కొబ్బరి బోండాల చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు, కూలర్లు, ఫ్రిజ్లు, టైర్లు, వంటి వస్తువులు నిల్వ ఉంచరాదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటైజేషన్ సెక్రటరీ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై దాడి

ప్రజాశక్తి-కొండపి

ఆస్తి తగాదాల కారణంగా మహిళపై దాడి జరిగిన సంఘటన కొండపి మండలంలోని మూగచింతల గ్రామంలో చోటు చేసుకుంది. కొండపి ఎస్ఐ వైవి రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మూగచింతల గ్రామానికి చెందిన కూనంనేని రామారావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య రమణమ్మ కుమారుడు అయిన వినోద్‌కుమార్ తన తండ్రి ఆస్తి పంపకంలో రెండో భార్య అయిన కవిత అక్రమంగా భూమి తన పేరుమీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకుందన్న కోపంతో మంగళవారం కవితపై దాడి చేశాడు. ఆ దాడిలో కవితకు తలకు, చేతి బలమైన గాయాలయ్యాయి. ఆ మేరకు బాధితురాలు కవిత కొండపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కొండపి ఎస్ఐ కేసు నమోదు చేసి బాధితురాలిని కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యసేవల కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సామాజిక కట్టుబాట్లపై 'మానికొండ' సమరం

ప్రజాశక్తి-కనిగిరి: సామాజిక కట్టుబాట్లపై సమరం సాగించిన మహనేత మానికొండ సూర్యవతి ఆదర్శప్రాయులని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సూర్యవతి 30వ వర్ధంతి సభ జరిగింది. చదువుకు స్వస్తి చెప్పి జాతీయోద్యమంలో క్రియా శీలకంగా పాల్గొన్నా రని ఆమె తెలిపారు. మహిళలను చైతన్యపరిచేందుకు మహిళా సంఘాన్ని ఏర్పాటు చేయగా సంఘం రాష్ట్రస్థాయికి విస్తరించిందన్నారు. మహిళలను సంఘటితపరిచి ఐక్యపోరాటాలు నిర్వహించటమే ఆమెకు ఇచ్చే అసలైన నివాళి అన్నారు.సూర్యావతి చిత్ర పటానికి నివాళు లర్పించారు. ఐద్వా జిల్లా నాయకులు ఎస్‌కె బషీరా, ప్రసన్న, భానుమతి, ఎస్‌కె కాదురున్నీసా, శాంతకుమారి, రవణమ్మ పాల్గొన్నారు.

యారకాలువ అభివృద్ధి పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్



బాపట్ల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలోని పరభూముల నుండి దుద్దుకూరు వాగుకు ఉత్తరముగా ఉన్న తూర్పు బాడవ భూములలో మద్దిరాల వాగు వరకు యారకాలువ మరియు వాటర్ షెడ్/చెక్ డ్యాం నిర్మాణం ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించాలంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. భారీ నీటి పారుదల శాఖ కార్యదర్శి ఇచ్చిన మెమో, రైతుల లేఖలతో పాటు, ప్రభుత్వ గౌరవ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఇచ్చిన లేఖలను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి సర్పంచ్ మల్లెం శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మన్నె చింపిరయ్య, గోగినేని ప్రభు తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందించారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన యువకుడిని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు అరెస్టు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెతో సహజీవనం చేసి, గర్భవతిని చేసి మోసగించిందాడని సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కంభం ఎస్ఐ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు. నిందితుడయిన షేక్ మహమ్మద్ సైఫుల్లాను అరెస్ట్ చేసి గిద్దలూరు న్యాయస్థానంలో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ ఢీకొని లెక్చరర్ మృతి

ప్రజాశక్తి-పామూరు

టిప్పర్ ఢీ కొని ఓ ప్రైవేట్ లెక్చరర్ మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని బుక్కాపురం సమీపంలో జరిగింది. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం, పామూరుపల్లి గ్రామానికి చెందిన హరిబాబు(32) పామూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా బుక్కాపురం సమీపంలో బైక్ టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తిరుమలలో టిడిపి ఉమ్మడి జిల్లా నాయకులు

తిరుమలలో టిడిపి నేతలు

ప్రజాశక్తి-కనిగిరి: ఉమ్మడి ప్రకాశం జిల్లాల టిడిపి నేతలు వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారా లోకేష్ యువగళం పాదయాత్ర నెల్లూరు జిల్లాలో కొనసాగుతుండగా వారు పాల్గొనేందుకు తరలివెళ్లారు. ఈ నెలలో ప్రకాశం జిల్లాలో జరిగే పాదయాత్రపై లోకేష్‌తో నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యేలు డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, టిడిపి నాయకులు, ఇన్‌చార్జ్‌లు నూకసాని బాలాజీ, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్, ఏలూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

350 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు మరియు ఎన్నారై రాయిని సుబ్బరామయ్య సహకారంతో ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 350 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ, విష జ్వరాలు లాంటి వ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. రోగ నిర్ధారణ జరిగిన 65 మంది పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. శిబిరంలో గ్రామ పెద్ద చెన్నుపాటి జనార్దన్‌రావు, డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ రాణి, కిమ్స్ హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుద్దుకూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-సింగరాయకొండ: మండల పరిధిలోని శానంపూడి గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై సెబ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి నలుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.19,210 నగదు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను సింగరాయకొండ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో జెడి టీం ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది, సెబ్ ఎస్ఐ సిహెచ్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



రోశయ్యకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

రాష్ట్ర మాజీమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 90వ జయంతిని మంగళవారం భట్టిప్రోలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, తెలుగుదేశం పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య యువజన సంఘాల రాష్ట్ర మాజీ అధ్యక్షులు తునుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన వేమూరులో జన్మించిన రోశయ్య అక్కడే ప్రాథమిక విద్యానభ్యసించి ఉన్నత పాఠశాల విద్యను భట్టిప్రోలు పాఠశాలలో కొనసాగించారన్నారు. ఎంఎల్‌సిగా రాజకీయ రంగప్రవేశం చేసి దశాబ్దాల పాటు ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా మచ్చలేని రాజకీయ నాయకుడిగా పదవులకే వన్నె తెచ్చారని కొనియడారు. చివరి దశలో తమిళనాడు గవర్నర్‌గా పనిచేసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అనారోగ్యంతో మృతి చెందారని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి సునీల్, శ్రీనివాసరావు, కురాళ్ల రవి, శనగపల్లి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, టిడిపి నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, కటకం కుమారస్వామి, ఊట్ల వెంకటేశ్వరరావు, డొక్కు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కాంస్య విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సుదీర్ఘ కాలం పాటు నిబద్ధత కలిగి నిజాయితీపరుడుగా గుర్తింపును సంపాదించుకున్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆదర్శప్రాయుడని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున అన్నారు. రోశయ్య స్వగ్రామం వేమూరులో ఆయన 90వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు కెవిపి రామచంద్రరావుతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ వేమూరు గ్రామంలో జన్మించిన రోశయ్య ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయులని తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు మాట్లాడుతూ నిబద్ధత, నిస్వార్థ రాజకీయవేత్త రోశయ్య అని కొనియాడారు. ఆయన లేని లోటు అటు కాంగ్రెస్ పార్టీకి వేమూరు నియోజక వర్గానికి తీరనిదన్నారు. ఆర్థికవేత్తగా పరిపాలనలో తనదయిన ముద్ర, గుర్తింపును సంపాదించిన వ్యక్తి రోశయ్య అన్నారు. ముఖ్యమంత్రి గానే కాక తమిళనాడు గవర్నర్‌గా ఎనలేని ఖ్యాతిని సంపాదించారన్నారు. ఆయన విగ్రహావిష్కరణకు రావటం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, ఆమంచి కృష్ణమోహన్, తెనాలి శాసనసభ్యులు అన్నబత్తుని శివ కుమార్, మద్దాల గిరిధర్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.



పర్చూరు తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్యులు

బాపట్ల జిల్లాకు రోశయ్య పేరు పెట్టాలి

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పర్చూరు తహశీల్దారును కలిసి బాపట్ల జిల్లాకు రోశయ్య పేరు పెట్టాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొణిజేటి రోశయ్య జిల్లా సాధన సమితి అధ్యక్షులు మామిడిపాక హరిప్రసాద్, దేవస్థానం ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం సుబ్బారావు, కోట శ్రీనివాసరావు, బి భాస్కర్‌రావు, వెంకటేశ్వరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు, కిరణ్, వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

విప్లవాగ్ని రగిలించిన 'అల్లూరి'

ప్రజాశక్తి-బాపట్ల

భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి, విప్లవాగ్ని రగిలించిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. మంగళవారం సీతారామరాజు జయంతి సందర్భంగా బాపట్ల సూర్యలంక రోడ్డులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కోన మాట్లాడుతూ భారతీయులకు స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని ప్రసాదించడంలో అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం మరువ రానిదన్నారు. అంతకుముందు కర్లపాలెం మండలం బుద్ధాం గ్రామంలో సీతారామరాజు విగ్రహానికి జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సీతారాంరెడ్డి, రైతు నాయకుడు దశరథ మహారాజు, బుల్లెట్ నాగరాజు, బెనర్జీ, భాస్కరరాజు, క్షత్రియ యూత్ నాయకులు ఉన్నారు.

యువత ముందుకు రావాలి: వేగేశన

మన్యం వీరుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు నేటి యువత ముందుకు రావాలని బాపట్ల తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మంగళవారం అల్లూరి 125వ జయంతి సందర్భంగా బాపట్ల సూర్యలంక బీచ్ రోడ్డు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను అంతమొందించటానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, మోదుగుల శంకర్‌రెడ్డి, దయాబాబు, పలువురు పార్టీ నాయకులు, క్షత్రియ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెల్లదొరలపై వీరోచిత పోరాటం

దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ దొరలపై వీరోచిత పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. మంగళవారం సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం బాపట్ల డివిజన్ ఆధ్వర్యంలో బాపట్ల సూర్యలంక రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం బాపట్ల అంబేద్కర్ భవనంలో జరిగిన సమావేశంలో మేకల ప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ వారి దోపిడీ విధానాలను భారత పౌరులపై సాగించిన హింసలు సాయుధ పోరాటం ద్వారా ప్రతిఘటించిన దేశభక్తుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ డివిజన్ కార్యదర్శి డి రాములమ్మ, ఏఐకేఎంఎస్ నాయకులు రంజాన్, విల్సన్, పీవైఎల్ నాయకులు వి విజయ్, పిఓడబ్ల్యు బాపట్ల డివిజన్ కార్యదర్శి ముప్వల పల్లవి పాల్గొన్నారు.

రేపల్లె: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం చిరస్మరణీయం అని తహశీల్దార్ మల్లిఖార్జునరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు తహసీల్దార్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తిలా బ్రిటిష్ వారితో పోరాటం చేశారని చెప్పారు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. పట్టణంలో వైసిపి, టీడీపీ, జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి విజయ సారథి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల జయంతి వేడుకలు



బాపట్లలో సీతారామరాజుకు నివాళి అర్పిస్తున్న కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: 'క్షత్రియ సేవా సమితి' ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని ఐలాండ్ సెంటర్‌లో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి అల్లూరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సమితి సభ్యులు వి ప్రసాద్‌రాజు, రుద్రరాజు వర్మరాజు (ఫోటో స్టాట్), వి రామకృష్ణంరాజు, గ్రామ సర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు, డేగల రవిరెడ్డి, మంతెన లక్ష్మీపతిరాజు, సుబ్బరాజు, మన్యం శ్రీనివాసరావు, కే సుబ్బారెడ్డి, ఎం నాగిరెడ్డి, చుక్క రంగయ్య, డేగల శ్రీను, ఏఎస్ రెడ్డి, ప్రభుత్వ సిహెచ్‌సి డాక్టర్లు సునీల్, అప్సర్బేగ్, మున్నం చిన సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి నేడు తెలుగు వారికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిందని అప్పిగట్ల గ్రామ సర్పంచ్ గుత్తికొండ రజనీ రాజేష్ అన్నారు. మంగళవారం బాపట్ల మండలం అప్పికట్ల గ్రామ సచివాలయ ఆవరణలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన చిత్రపటానికి రజినీ రాజేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జగనన్న సురక్ష ప్రత్యేక అధికారి శేషు కుమార్, ఎంపీడీఓ రాధాకష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, పంచాయతీరాజ్ ఏఈ మోహన్‌రావు తదితరులు అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులు అర్పించారు. ప్రత్యేక అధికారి శేషుకుమార్ మాట్లాడుతూ అల్లూరి ఆత్మత్యాగం, పోరాట స్ఫూర్తి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమం లో, కార్యదర్శి జిలాని, వార్డు సభ్యులు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ ఎన్ రాధ అన్నారు. మంగళవారం డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సందర్భంగా డాక్టర్ రాధా మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరికి ప్రత్యేక అధ్యాయం ఉందన్నారు. నూరిని స్ఫూర్తిగా తీసుకుని అందరం ముందుకు సాగాలని ఆమె కోరారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు అల్లూరి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మసాలా ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ వివి సత్యనారాయణ, డాక్టర్ సిహెచ్ సోమేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విమల బీర, సౌజన్య, ప్రీతి సాగర్, శ్రీనివాస్, ఫణీంద్ర తదితర బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నరేంద్రవర్మ

అద్దంకి: అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా నందమూరి కళాపరిషత్తు కార్యాలయంలో మంగళవారం జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ నాడు ప్రజలను హింసిస్తున్న బ్రిటిష్ పాలనకు చరమగీతం పాడేందుకు సాయుధ పోరాటాన్ని నమ్మి బ్రిటిష్ పాలకులకు ముచ్చెమటలు పట్టించి భరతమాత స్వేచ్ఛ కోసం తెల్లవారి తూటాలకు బలైపోయిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవశక్తి అని అన్నారు. వారి త్యాగం భరతజాతి ఎప్పటికీ మరువదన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుడు చేబ్రోలు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భరత జాతి గుండెల్లో విప్లవ జ్యోతిగా నిలిచిన భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి అన్నారు. ఈ కార్యక్రమంలో గోవాడ శ్రీకాంత్, అంగలకుర్తి హనుమయ్య, డి భాస్కరరావు, తంగిరాల వెంకటేశ్వర్లు, పోలినేని చరిష్మా, పోలినేని సురేష్, పి శ్రీనివాసరావు, ఎస్‌కే నాగూర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు అని ఆయన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ హాస్టల్ విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-చీరాల

ఉమ్మడి రాష్ట్ర ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు, తమిళనాడు మాజీ గవర్నర్, తెలుగు ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి అన్నారు. మంగళవారం రోశయ్య జన్మదినోత్సవం సందర్భంగా ఎంజిసి క్లాత్ మార్కెట్ వద్ద చీరాల పురపాలక సంఘం నిధులతో రోశయ్య విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు, ముఖ్యఅతిథిగా రోశయ్య కుమారుడు శివ సుబ్బారావు ఆయన కుటుంబ సభ్యులు హాజరై రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరణం బలరాం మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తెలుగు ఉమ్మడి రాష్ట్రాలలో ఆనాడు జరిగిన అసెంబ్లీ సమావేశాలలో రూ.లక్ష కోట్లతో 16 సార్లు అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కేవలం కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని అన్నారు. రాజకీయాలలో అంచెలంచలుగా ఎదుగుతూ అందరి మన్నలతో ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా ఆయన అందించిన సేవలు అనేకమని అన్నారు. చీరాలలోని ఎంజిసి క్లాత్ మార్కెట్‌కు ప్రత్యేక స్థానం కల్పించిన వ్యక్తి రోశయ్య అన్నారు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని చీరాలలో ఆవిష్కరించటం అభినందనీయమని అన్నారు. అనంతరం రోశయ్య కుటుంబ సభ్యులను సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ బోనిగల జైసన్ బాబు, కౌన్సిలర్లు మామిడాల రాములు, ఉల్లిపాయల సుబ్బయ్య, గుంటూరు ప్రభాకర్‌రావు బాలకష్ణ, గోలి స్వాతి, సుధ, మల్లెల రాజశేఖర్, శివ నారాయణమూర్తి, టిటిఎంప ప్రతినిధులు, ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహావిష్కరణలో కెవిపి, కరణం తదితరులు

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మార్కాపురం-1 సచివాలయం పరిధిలో 4వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష లేకుండా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలోనూ వెనుకబాటు లేదన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసి సిఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి,కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **జరుగుమల్లి :** పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కొండపి వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని వర్ధినేనివారిపాలెం సచివాలయ పరిధిలోని పీరాపురం, కొత్తపాలెం గ్రామాలలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ పాటికే తాను 99,000 గడపలను సందర్శించి ప్రజల మన్నలను పొందినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బెల్లం సత్యన్నారాయణ, ఎంపిడిఒ కె.జలపాక్ష్మి, ఎపిఎం కె.నాగరాజు, ఎపిఒ భాగ్యలక్ష్మి, కొత్తపాలెం గ్రామ సర్పంచి బొట్లగుంట మాల్యాద్రి, వర్ధినేని జ్యోతిబాబు, బొట్లగుంట మనోజ్,జెసిఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, కసుకుర్తి బద్రి, నల్లూరి సురేంద్ర, ఎఎంసి డైరెక్టర్ పల్లాల శివకోటిరెడ్డి, మారంరెడ్డి గంగాధర్, సురేష్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న అశోక్‌బాబు



సజ్జల రామకృష్ణారెడ్డితో ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

'సజ్జల'ను కలిసిన ఎమ్మెల్యే టిజెఆర్

ప్రజాశక్తి మద్దిపాడు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామ కష్ణారెడ్డిని సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు తాడేపల్లిలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సజ్జలను ఎమ్మెల్యే కలవటంరాజకీయం ప్రాధాన్యత సంతరించుకుంది. సజ్జలను కలిసిన వారిలో వైసిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, దుంపా చెంచురెడ్డి, పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు జి.అయ్యన్న, దొడ్డవరప్పాడు సర్పంచి బెజవాడ శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ప్రజాశక్తి-దర్శి

దర్శి నగరపంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్క రించేందుకు అమృత పథకం ద్వారా రూ. 121 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో కమినషర్ వై. మహేష్ అధ్యక్షతన కౌన్సిలర్లు, అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే త్వరలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు. దర్శిలో ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి పులిపాడు చెరువు నుంచి వాటిని నింపి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. అమృత పథకం ద్వారా కడపకు రూ. 450 కోట్లు, ఒంగోలుకు రూ. 125 కోట్లు, దర్శి రూ. 121 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. దర్శి నగర పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 5 కోట్లు వచ్చినట్లు తెలిపారు. ఆ నిధులతో సిసిరోడ్లు, సైడుకాలువలు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు విసిరెడ్డి, మోహన్‌రెడ్డి, జ్యోతి, సరస్వతి, నాయకులు జగన్మోహన్, మజ్నువలి పాల్గొన్నారు. అయితే సమావేశానికి టిడిపికి చెందిన కౌన్సిల్ సభ్యులు హాజరు కాలేదు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేణుగోపాల్

ఎపి బాక్సింగ్ శాప్ కోచ్‌గా

పాణ్యం వేణు నియామకం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అరుణాచల్ ప్రదేశ్‌లో ఈనెల 8 నుంచి 15 వరకూ 5వ జాతీయ జూనియర్ బాలుర బాక్సింగ్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న రాష్ట్ర జట్టుకు కోచ్‌గా మార్కాపురానికి చెందిన బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణును నియమిస్తూ ఎపి క్రీడాప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కోచ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాణ్యం వేణు గత ఆరు సంవత్స రాలుగా జిల్లాస్పోర్ట్స్ అథారిటీలో పనిచేస్తున్నాడు. అనేక మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి. జాతీయ స్థాయిలో పథకాలు సాధించేలా కృషి చేశారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఎంపికైన వేణును బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. సుబ్బారావు, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయరాజు, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ. స్టెప్ సిఇఒ బాబూరావు, చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి, శ్రీ కోడి రామమూర్తి క్రీడా సాంస్కతిక సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు అభినందనలు తెలిపారు.





పుస్తకాలు అందజేస్తున్న నాటక మండలి సభ్యులు

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- ఒంగోలుకలెక్టరేట్

కొప్పోలులోని బివిఆర్ హైస్కూల్‌లో మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజు జయంతిని శ్రీఅల్లూరి సీతారామరాజు నాటక మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీఅల్లూరి సీతారామరాజు నాటక మండలి సభ్యులు కాట్రగడ్డ నాగేశ్వరావు, అంజి రెడ్డి, కోనంకి చిరంజీవి, మోడు బోయిన నాగరాజు, హరికృష్ణ, మైనేని నాగేశ్వరరావు, ఘట్టంనేని శ్రీనివాసులు, సుబ్బారావు, జగన్నాథం, జయరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉన్నం రమణయ్య, ఉపాధ్యాయులు శేషిరెడ్డి, కోడెల కోటయ్య చిరంజీవి,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **దర్శి :** తాళ్ళూరు మండలం శివరామపురం ప్రాథమిక పాఠశాలలో చదవుతున్న విద్యార్థులకు దర్శికి చెందిన దేవతి రవికుమార్ తమ తండ్రి చెంచయ్య జ్ఞాపకార్థంగా నోటు పుస్తకాలు, పెన్నులు, బలపాలు, పెన్సిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రైతు సంఘం కార్యాల యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 70 శాతం మంది ప్రజలకు వ్యవసాయ రంగమే ఆధారమన్నారు. అందరికీ ఆహారం, పారిశ్రమికాభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ఈ రంగం ఎంతో కీలకమన్నారు. నేడు వ్యవసాయం పరిస్థితి దారుణంగా మారిందన్నారు. రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగ సంక్షోభం, పరిష్కార మార్గాలు అంశంపై ఈనెల 7న ఒంగోలులోని బృందావనం కల్యాణ వేదికలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి అధ్యక్షులుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, ముఖ్య వక్తలుగా అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, ప్రముఖ ఆర్థిక రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పాల్గొంటారని తెలిపారు. వేలాదిగా రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుర్రం లక్ష్మి నారాయణ, కందుల ప్రభాకర్, భూమని వెంకటేశం, మండ్లి మల్లయ్య, నల్లబోతుల పాండు, కోటా వెంకటరెడ్డి, తిరుమలరెడ్డి, షేక్ సుభాని, షేక్ అమీర్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గాలి వెంకటరామిరెడ్డి

వాగు పోరంబోకు ఆక్రమణ

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా తహశీల్దారు కార్యాలయం పక్కన నాలుగు నెలల క్రితం సర్వే నెం.398/2లో ఎ.3.54 సెంట్ల భూమిలో రియల్టర్లు లేఅవుట్ వేశారు. ఆ భూమిని ఆనుకొని సర్వే నెం 349/2లో ఉన్న వాగు పోరంబోకు భూమి కబ్జాకు గురైంది. వాగును ఇరువైపులా కుదించి మట్టి బోసి చదును చేశారు. గతంలో 7 మీటర్లగా వెడల్పు ఉన్న వాగు రియల్టర్లు కుదించి మూడు మీటర్లు చేసి కాంక్రీటుతో బ్రిడ్జి కట్టి ఆక్రమించారు. వాగు ఆక్రమణ వల్ల వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగి వెలిగండ్లలోని ఇందిరా కాలనీ లోకి నీరు వస్తుంది. వాగులు, వంకల ఆక్రమణలు తొలగించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికులు గతంలో విన్నవించు కున్నారు. అయినప్పటికీ అధికారులు రియల్టర్లకు వత్తాసు పలుకుతూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. గంత్యరం లేక కాలనీ వాసులు, గ్రామ స్తులు జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి దష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వెలిగండ్లలో వాగులు వంకలు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులు పట్టించుకోవటం లేదని తిరుపతి రెడ్డి జేసీ దష్టికి తెచ్చారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే నెం.349/2 వాగు పోరంబోకు భూమిని అధికారులు మంగళ వారం సర్వే చేశారు. 40 సెంట్ల మేర వాగు ఆక్రమణకు గురైనట్లు గుర్తిం చారు. అందులో అది ప్రభుత్వ భూమిగా నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు.



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

పచ్చని చెట్లు నరికివేత

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం అనకర్లపూడిలో రహదారిలో రహదారి వెంబడి ఉన్న చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేశారు. మండుటెండల్లో ప్రయాణికులకు నీడనిచ్చేందుకు గానూ ఐదు సంవత్సరాల క్రితం రహదారి వెంబడి మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. అవి ప్రస్తుతం దట్టంగా పెరిగి రాకపోకల సమయంలో ప్రయాణికులకు నీడను ఇస్తున్నాయి. రహదారి వెంబడి ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఈ చెట్లను అక్రమంగా నరికి వేశారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు స్పందించిన పర్యవరాణాన్ని పరిరక్షించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు జి.నాగేశ్వరరావు కోరారు.

108 వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం మంజూరు చేసిన 108 వాహనాన్ని స్థానిక సర్పంచి చిత్తూరి హరిక, ఎంపిపి గుమ్మ పద్మజ యల్లేష్, వైసీపీ మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదాలను నివారించి మరణాల రేటును తగ్గించేందుకు అధిక సంఖ్యలో 108 వాహనాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ వాహనాలను ప్రజలంతా అవసరాన్ని బట్టి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కర్ కుమార్, డాక్టర్ లక్ష్మి కళ్యాణి, డాక్టర్ బాల ఈశ్వరయ్య, డాక్టర్ మెర్సి ప్రియాంక, హెడ్ నర్స్ ఎలిజిబెత్ రాణి, ఆరోగ్య మిత్రలు దర్శనం రాంబాబు, సంగటి మణికుమార్, లక్ష్మీరెడ్డి, ఎస్‌టి సెల్ నాయకులు లాలూ నాయక్, వైద్యశాల సిబ్బంది, 108 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

88 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని మూగచింతల, గుర్రపడియా, నెన్నూరుపాడు, సతుకుపాడు, కె.అగ్రహారం, నేతివారిపాలెం, రామ చంద్రాపురం, కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 730 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 642 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 88 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.245, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.230.53 పైసలు పలికింది.

పాఠశాలల్లో తనిఖీ

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రైవేటు పాఠశాలలు, కళాశాల్లో పరిశుభ్రత, రక్షిత నీటిని అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్‌రసూల్ తెలిపారు. పట్టణంలోని నారాయణ టెక్నో స్కూల్, శ్రీచైతన్య స్కూల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సంఖ్యకు అనుగుణంగా బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బాత్‌రూమ్‌లను ప్రతిరోజు ఫెనాయిల్‌తో కడగాలన్నారు. రక్షిత నీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి లోపం తలెత్తినా యాజమాన్యాలదే బాధ్యత అని ఆయన హెచ్చరించారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

బాధితురాలికి పరామర్శ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యాధికారి కంచర్ల నాగార్జున గౌడ్ వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడి యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న నాయుడుపాలెం హెల్త్ సబ్ సెంటర్ ఎఎన్ఎం దేవికాబాయికి న్యాయం చేయాలని ఎపి ఎన్‌జిఒ తాలూకా యూనిట్ నాయకులు డిమాండ్ చేశారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న దేవికాబాయిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒ తాలూకా యూనిట్ అధ్యక్షుడు చేదూరి రవి కుమార్ మాట్లాడుతూ దేవికాబాయికి న్యాయం చేయాలని కోరారు. ఆమె ఆత్మహత్య యత్నానికి బాధ్యులైన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ తాలూకా యూనిట్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి లక్ష్మమ్మ, ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, గౌరవాధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.

బ్రిటీష్ వారిని గడగడలాడించిన


విప్లవవీరుడు అల్లూరి : ఎస్‌పి

ప్రజాశక్తి -ఒంగోలు క్రైం

బ్రిటీష్ వారిని గడగడలాడించి వారి గుండెల్లో సింహ స్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని ఎస్‌పి మల్లిక గర్గ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పోలీస్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్‌పి మల్లిక గర్గ్, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డిఎస్‌బి డిఎస్‌పి బి.మరియాదాసు, ఏఆర్ డిఎస్‌పి వెంకటేశ్వరావు, ఒంగోలు రూరల్ శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐలు హరి బాబు, శ్రీహరిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** అల్లూరి సీతారామరాజు జయంతి లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు హరిబాబు, నాయకులు పి. రాములు నాయక్, బి. హనుమంతరావు నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, ఆర్ బద్దే నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, రాజు నాయక్, నాగేశ్వరరావు నాయక్, శ్రీను నాయక్, ప్రసాద్ నాయక్, మంత్రూ నాయక్ పాల్గొన్నారు. **మార్కాపురం :** మహనీయుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, దివంగత మాజీ సిఎం కొణిజేటి రోశయ్య, వంగవీటి రంగ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అల్లూరి, రోశయ్య, వంగవీటి చిత్ర పటాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారి జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, తర్లుపాడు ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మీర్జా ఉస్మాన్‌బేగ్, పట్టణ జెఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, 11వ బ్లాక్ వైసిపి ఇన్‌ఛార్జి ఎం.ఉత్తమ్‌కుమార్, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బాబి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడు నాలి కొండయ్య యాదవ్, వైసిపి నాయకులు డాక్టర్‌కిరణ్‌కుమార్, రహంతుల్లా, తుడిమెళ్ల అడివయ్య, తానుగుండాల వెంకటేశ్వర్‌రెడ్డి, రోజ్ లిడియా పాల్గొన్నారు. **మార్కాపురం :** స్థానిక శ్రీసాయి బాలాజీ హైస్కూల్, వాసవీ విద్యానికేతన్‌లో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, స్వామి వివేకానంద వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి బాలాజీ హైస్కూల్ కరస్పాండెంట్ పెరుమాళ్ల ప్రకాశరావు, వాసవీ విద్యానికేతన్ కరస్పాండెంట్ కందేపు రంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. **కొమరోలు :** స్థానిక ఎస్‌పిఎస్‌ఆర్‌ఎం స్కూల్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు అల్లూరి సీతారామరాజు వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సుబ్బారెడ్డి, రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **టంగుటూరు :** మండల పరిధిలోని అనంతవరం గ్రామంలో అల్లూరి సీతా రామరాజు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఉప్పలపాటి శివరామరాజు, రాజు, ఎంపిడిఒ పి రత్నజ్యోతి, ఉప తహశీల్దారు జె శ్రీనాథ్, వైసిపి గ్రామ కన్వీనర్ ఉప్పలపాటి సుబ్బరాజు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఎంపిటిసి కసుకుర్తి కోటేశ్వరరావు, నాయకులు మర్రి భాస్కర్ రెడ్డి, జిల్లా చంద్రశేఖర్, రాజు వేణుగోపాల్ రెడ్డి, కన్నా వెంకట్రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌పి మల్లిక గర్గ్



అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



రిలే దీక్షలు నిర్వహిస్తున్న నాయకులు

కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఎస్‌టి నాయకుడు గరికపాటి అంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని చాలా కాలంగా దళిత సంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ నామ మాత్రపు హామీలతో పాలకులు రోజులు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏప్రిల్ నెల 12వ మార్కాపురం పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంబేద్కర్ భవనానికి స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ హామీ అమలు కాలేదని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. అనంతరం ఉప కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. దీక్షల్లో దళిత సంఘాల నాయకులు సంద్రపాటి కాలేబు, జనుమాల నాగయ్య, చింతగుంట్ల బాబు, బహుజన సైన్యం కమిటీ సభ్యులు చిన్నబాబు, నాగేంద్ర, రంగా, చిట్టిబాబు ఇజ్రాయిల్, అశోక్, ఏలియా నాగరాజు, రవి ఇజ్రాయిల్ పాల్ రాజు దీక్షల్లో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, తిమోతి, సుబ్బయ్య, శాంత కుమార్, నాసర్, పాపయ్య కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని సహించేది లేదు

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పుత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి



సివిల్ సప్లయ్ గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రేషన్ షాపుల డీలర్లు అవినీతికి పాల్పడితే సహించేది లేదని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పుత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు భవనంలో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు తూకాల్లో మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్డుదారులకు ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. ఎండియు వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేసే సమయంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రతి రేషన్ షాపులో ధరల పట్టికను సూచించే బోర్డును అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం యర్రగొండ పాలెంలోని సివిల్ సప్లై గోడౌన్‌ను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఒ ఉదయ భాస్కర్, డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ముస్తాక్, తహశీల్దారు రవీంద్రారెడ్డి, గోడౌన్ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మెనూ ఖచ్చితంగా అమలు చేయాలి

మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పుత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి అన్నారు. గురిజేపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని, రేషన్ షాపును ఆయన తనిఖీ చేశారు. బోయలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ ప్రభుత్వ నిబంధనల మేరకు అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్న కార్యకర్త ప్రభావతి, ఆయాలను సన్మానించారు. ఆ తర్వాత యర్రగొండపాలెం లోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినుతో మాట్లాడారు. సమస్యల పట్ల ఆరా తీశారు. మెనూ అమలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఒ ఉదయ భాస్కర్, డిప్యూటీ కలెక్టర్ మాధురి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ముస్తాక్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, డిడిసిడబ్ల్యు అంజల, ఎటిడబ్ల్యుఒ అమర సుబ్బయ్య, ఎఎస్‌డబ్ల్యుఒ అరుణ, తహశీల్దారు రవీంద్రారెడ్డి, సిడిపిఒ పద్మావతి, ఎంఇఒ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులై ఉండి లబ్ధి పొందలేని ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షులు పైనం రంగారెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం పొన్నపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష లబ్ధిదారులకు వివిధ రకాలైన ధ్రువీకరణ పత్రాలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ ఉపాధ్యక్షులు పైనం రంగారెడ్డి, మండల వైసిపి అధ్యక్షులు పైనం ఏడుకొండలురెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పైనం బసవ పున్నమ్మ అధ్యక్షత వహించగా, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పైనం రంగారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులై ఉండి, వివిధ కారణాల చేత సంక్షేమ పథకాలు అందని వారందరికీ వారికి కావాల్సిన పత్రాలు మంజూరు చేసి సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్ అండ్ ఆర్‌డిజి మురళీకృష్ణ, వేమారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మండల పరిషత్ ఉపాధ్యక్షులు పైనం రంగారెడ్డి, పైనం ఏడుకొండలరెడ్డి

బాపట్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల ఎంపీపీ పి హరిబాబు అన్నారు. మంగళవారం బాపట్ల మండల పరిధిలోని భర్తీపూడి గ్రామంలో జరిగిన సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అర్హులై ఉండి ఎటువంటి ప్రభుత్వ పథకాలు పొందని వారు ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ పులి బ్రహ్మయ్య, సర్పంచ్ అమరేష్ జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు, ఎమ్మార్వో సుధారాణి, ఈవోపీఆర్‌డి శరత్ బాబు, పంచాయతీ కార్యదర్శి తాత సాయి పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్షలో భాగంగా నగరం మండలంలోని కొలగానివారిపాలెం, అద్దంకివారిపాలెం గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధృవపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, లుక్కా బాపనయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: మండలంలోని ఐలవరం గ్రామంలో సచివాలయం-2 పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష పథకం కింద లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. మండల తహసీల్దార్ డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టి గృహ సారథులకు పలు సూచనలు అందించారు. ప్రజల అవసరాలు గుర్తించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, విఆర్‌ఓలు రత్నాకర్, గ్రేసమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు ఉన్నారు.

రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి: తహశీల్దార్

ప్రజాశక్తి-చీరాల

సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యతగా రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దారు ప్రభాకర్‌రావు సిబ్బందిని ఆదేశించారు. జగనన్న సంరక్షణలో వచ్చిన అర్జీలను సచివాలయ సిబ్బంది త్వరగా పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించాలని అన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న సంరక్షణలో రెవెన్యూ సమస్యలు, ఇతర సేవలపై వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దని, సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన అర్జీలు వెంటనే పరిష్కరించాలని విఆర్‌ఓ లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విఆర్‌వోలు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న రోటరీ సభ్యులు

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి 2023-24 సంవత్సరానికి కొత్తగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఘనంగా జరిగింది. రోటరీ ఫౌండర్ ఛైర్మన్ పాల్ హారీస్ చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ 3,150 డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి విచ్చేసి నూతన కమిటీ అధ్యక్షులుగా ఎన్నికయిన చిన్ని మురళీకృష్ణ, కార్యదర్శిగా చప్పిడి వీరయ్య, కోశాధికారిగా కొల్లా భువనేశ్వరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బోర్డు అఫ్ డైరెక్టర్స్ చేత, నూతన సభ్యులు చిన్ని మురళీకృష్ణ భార్య వసంతలక్ష్మి, తాళ్లూరి వెంకట సుబ్బయ్య చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సభలో ఆత్మీయ అతిథిగా అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్ విచ్చేశారు. తాజా మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించి గత సంవత్సరంలో చేసిన కార్యక్రమాల వివరాలు వచ్చిన అవార్డులు వివరించారు. కార్యక్రమ వ్యాఖ్యాతలుగా డాక్టర్ ఉబ్బా దేవపాలన, షేక్ మహమ్మద్ రఫీ, బాచిన పూర్ణచంద్రరావు వ్యవహరించారు. రోటరీ ఫౌండేషన్ నిధికి నూతన అధ్యక్షులు మురళీకృష్ణ 24,000 రూపాయల చెక్కు, అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లేవి ప్రసాద్ మరియు కార్యదర్శి చప్పిడి వీరయ్య 12,000 రూపాయలు చెక్కులు డిజికి అందించారు. హార్ట్ ఆపరేషన్ అవసరమైన అద్దంకి తల్లిదండ్రులకు మురళీకష్ణ 6000 రూపాయలు సహాయం చేశారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ శంకరరెడ్డి మాట్లాడుతూ 118 సంవత్సరాల క్రితం పాల్ హారీస్ ప్రారంభించిన రోటరీ సంస్థ ఇప్పుడు 200 పైగా దేశాలలో 36,000 శాఖలతో ప్రపంచమంతా సేవలు అందిస్తున్నదని, ప్రముఖంగా పోలియో నిర్మూలనలో విశేష కృషి చేసినదని పేర్కొన్నారు. తాజా మాజీ కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, రోటరీ పెద్దలు వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డాక్టర్ ఫణీంద్రబాబు, నర్రా శ్రీలక్ష్మి, జె శివకుమారి, పిఎల్‌వి నరసింహారావు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, సంకా బాబు, మలాది శ్రీనివాసరావు, కరి రామయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, చామర్తి గురుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పింగళి దీప్తి.. ఖండాంతర కీర్తి

ప్రజాశక్తి-బాపట్ల



పింగళికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

జాతీయ జెండాకు రూపకల్పన చేసి తెలుగు వారి కీర్తి పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేశారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 60వ వర్ధంతి సందర్భంగా బాపట్ల రైల్వేస్టేషన్ ఎదురు ఉన్న పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సాయిబాబా మాట్లాడుతూ పింగళి వెంకయ్య జాతి అస్తిత్వానికి చిహ్నమైన జెండాను రూపుదిద్ది తెలుగువారి ఖ్యాతిని ఇనుమడింపచేశారని కొనియాడారు. జాతీయ జెండా రెపరెపల్లో తెలుగువారి ఘనత ప్రజ్వలిస్తూనే ఉంటుందన్నారు. ఎన్నో దేశాల జెండాలను పరిశీలించి, ఎంతో శ్రమకోర్చి మన జాతీయ జెండాను పింగళి రూపొందించారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభలలో పింగళి పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ ముఖ్య ఘట్టాలన్నిటిలో చురుకుగా పాల్గొన్నారాయన. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె జితేంద్ర, కవిత సొసైటీ అధ్యక్షుడు బి రాజారావు, ఏవీవీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పిడి అర్జున్‌రావు

నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల

స్వయం సహాయక సంఘాలకు ఏడాది కాలంలో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి అర్జునరావు అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో డిఆర్డిఏ ఏపీఎంలో సీసీలకు ఉన్నతి పథకం నిర్వహణ వినియోగంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జున రావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో మహిళలు ఆర్థిక సాధికార సాధించేందుకు అవసరమైన కొత్త యూనిట్లను ఉన్నతి పథకం ద్వారా అమలు చేయాలన్నారు. అదేవిధంగా రికవరీ నూటికి నూరు శాతం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం ఐబి సుబ్బారావు, ఎల్‌హెచ్‌డిపి ఎం లక్ష్మణాచారి, ఉన్నతి ఏపీఎం రామకృష్ణ, ఆర్థిక విభాగం డిపిఎం రవికుమార్, చేయూత డిపిఎం ప్రమీల, శ్రీనిధి ఏపీఎం నాగబాబు ఐబి ఎంపిఎం చిన్నయ్య, ఇన్సూరెన్స్ ఏపీఎం రాజారావు, ఫణిబాబు పాల్గొన్నారు.

రేపు నూజిళ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని నూజెళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 6వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలు వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కిమ్స్ ఉచిత వైద్య శిబిర సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, కిమ్స్ హాస్పిటల్స్ అద్దంకి ఏరియా పిఆర్‌ఓ పి కాలేషావలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి లోపల శుక్లములు, పొరలు ఉన్నవారికి, సాధారణ వ్యాధులకు, గుండె సంబంధిత వ్యాధులకు, ఎముకలు కీళ్ల నరముల వ్యాధులకు, గ్యాస్ ట్రబుల్ సమస్యలు ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తారని తెలియజేశారు. కంటి లోపల శుక్లములు, పొరలు ఉన్నవారికి వారి యొక్క ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్స్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నూజెళ్లపల్లి, పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9492120399 అను సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు.



బాధితులకు సాయమందిస్తున్న ఎంపిపి శ్రీకృష్ణయ్య

బాధితులకు ఎంపిపి పరామర్శ

ప్రజాశక్తి-నగరం: మండలంలోని చినమట్లపూడి గ్రామ పంచాయతీ శివారు మండే మాలపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన మండే భాగ్యారావు, మండే వెంకటేశ్వరరావు బాధితులను ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య మంగళవారం పరామర్శించారు. ఒక్కొక్కరికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు తన వ్యక్తిగతంగా అందించిన రూ.10 వేల సాయం, రూ.5 వేల ప్రభుత్వ సాయం, మొత్తం రూ.15 వేలను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవి, ఎంపిటిసి కరీమ్, ఆలీబుడా, గ్రామస్తులు ఉన్నారు.



రంగాకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

'వంగవీటి'కి ఘన నివాళి

ప్రజాశక్తి-నగరం: దివంగత వంగవీటి మోహనరంగా 76వ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన నగరం సెంటర్‌లో నాగం శ్రీనివాసరావు అలియాస్ రంగా ఏర్పాటు చేసిన రంగా చిత్రపటానికి స్థానిక ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా బడుగు బలహీన వర్గాలకు ఒక శక్తిలా వ్యవహరించారని, అలాంటి మహనీయుని కోల్పోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బొరమాదిగపల్లి సర్పంచ్ చందోలు దేవదాసు, నగరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు మత్తి రవికుమార్, నగరం సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు తహశీల్దారు కార్యాలయం ఆవరణలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి రీసర్వే డిటి లక్ష్మి కుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ పుష్పలత, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్
- ట్రాన్స్‌పోర్ట్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రవాణా అధికారి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నా కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అయ్యపరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ఒంగోలు డిపో అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మీరావలి , పొదిలి డిపో నాయకులు వేణు, కనిగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే..

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- రుసుములు తెలిసేలా బోర్డులు పెట్టాలి
- అధికారులకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పిసిపిఎన్‌డిటి నియమ నిబంధనల ప్రకారం ప్రతి స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం పిసిపిఎన్ డిటి మల్టీ మెంబర్ అప్రాయియేట్ అథారిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కొత్తగా స్కానింగ్ సెంటర్స్ కోసం చేసుకున్న దరఖాస్తులు, రెన్యూవల్ కోసం చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, స్కానింగ్ రుసుముల వివరాలు ప్రజలకు కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పిఎన్‌పిడిటికి సంబంధించిన ఐఇసి బోర్డులు, వైద్యుల వివరాలను ఏర్పాటు చేయాలన్నారు. నియమ నిబంధనల ప్రకారం పనిచేయని స్కానింగ్ సెంటర్స్‌ను సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రోజూ నిర్వహించిన స్కానింగ్ పరీక్షల వివరాలను ఫారం-ఎఫ్‌లో విధిగా పిఎన్‌పిడిటి వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలా చేయనివారిపై పిఎన్ పిడిటి చట్టం నియమ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. స్కానింగ్ సెంటర్లను సందర్శించేటప్పుడు కమిటీ సభ్యులందరూ విధిగా హాజరు కావలసిందిగా ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ సురేష్‌కుమార్, ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాధవీలత, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, విక్రమ శ్రీనివాసరావు ట్రాఫిక్ డిఎస్‌పి గౌతమి ఫాండేషన్ అంకయ్య, మాస్ మీడియా అధికారి శ్రీనివాసరావు, డేటా మేనేజర్ చల్లా ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.


మంత్రి పీయుష్ గోయల్‌ను కలిసిన మాగుంట

అదనపు పొగాకు ఉత్పత్తిపై

పెనాల్టీ రద్దు చేసిన కేంద్రం

ధన్యవాదాలు తెలియజేసిన 'మాగుంట'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతులు పండించిన అదనపు పొగాకు ఉత్పత్తిపై పెనాల్టీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ ఈ విషయాన్ని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రిని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాగుంట మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మారెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-చీరాల

చీరాల మండల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకర్‌రావును రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన సత్కార వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్‌గా ప్రభాకర్‌రావు ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయ్యిందన్నారు. ఏడాదిగా చీరాల మండలంలో రెవెన్యూ సేవలను సకాలంలో ప్రజలకు అందిస్తూ మండలాభివద్ధికి కషి చేశారని అన్నారు. ముందుగా రెవెన్యూ సిబ్బంది అందరూ తహశీల్దార్ ప్రభాకర్‌రావుతో కేక్ కటింగ్ చేయించి.. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్, రూరల్ అర్బన్ ఆర్ఐలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోపాలు లేకుండా ఓటర్ల జాబితా

- ఓట్ల పరిశీలనలో వాలంటీర్లను భాగస్వాములు చేయొద్దు
- అధికారులకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎలాంటి లోపాలు లేకుండా ఓటర్ల జాబితా తయారు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఇందులో భాగంగా డోర్ నెంబర్లు లేని ఇళ్లను వారం రోజుల్లో గుర్తించేలా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా స్థానిక సంస్థలకు సర్క్యులర్ జారీ చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆయా విషయాలపై మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓట్ల పరిశీలనలో వాలంటీర్లను భాగస్వాములు చేయొద్దన్నారు. జిల్లా కేంద్రంలో సెంట్రల్ డేటా సిస్టం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ ఆర్. శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, అజయ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల నుంచి

వ్యాధులు సంక్రమించకుండా చర్యలు

అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పశుపక్ష్యాదుల నుంచి ప్రజలకు వ్యాధులు సంక్రమించకుండా అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. జూనోటిక్ కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో మంగళవారం జరిగింది. ప్రజారోగ్యం పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల ఆరో తేదీన జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంపుడు జంతువులకు టీకాలు వేయాలన్నారు. జంతువుల నుంచి ప్రజలకు పలు వ్యాధులు సంక్రమిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యంగా పెంపుడు కుక్కల నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఇందుకోసం అత్యవసర పరిస్థితులను దష్టిలో పెట్టుకొని పశువైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 11 వేల రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు పశువైద్యశాలల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాలలో వీధి కుక్కల సంతతిని నియంత్రించడానికి కుటుంబ నియంత్రణకు శస్త్రచికిత్సలు నిర్వహించాలన్నారు. జూనోటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామని సంబంధిత శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. సమావేశములో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యం హనుమంతరావు, డి.ఐ.ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఒయాసిస్'లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రతి నెలా రెండో ఆదివారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆపరేషన్స్ మేనేజర్ ఎస్.యామిని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సంతానలేమి స్పెషలిస్ట్ డాక్టర్ దీపిక బొప్పన ఆధ్వర్యంలో ఉచిత కన్సల్టేషన్ మరియు ఉచిత స్కాన్ మరియు ఉచిత ఐయుఐ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఒంగోలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7842173132 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహారం అందించకపోతే చర్యలు

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ


ఆహారాన్ని రుచి చూస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను, ప్రభుత్వ వసతి గృహాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చితా విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం సాయంత్రం అకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ముందుగా తనిఖీ చేశారు. అక్కడ నుంచి నేరుగా తల్లులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా అందాల్సినవన్నీ అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అన్నీ అందుతున్నాయని చెప్పడంతో అక్కడ నుంచి మండలంలోని రాయవరం వెళ్లారు. అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కోడిగుడ్డు చిన్నగా ఉండటంతో తూకం వేశారు. 38 గ్రాముల బరువు మాత్రమే ఉంది. ఈ విషయమై జెసి శ్రీనివాసులుతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా అంతటా కోడిగుడ్ల సైజు పెంచాలన్నారు. అదే గ్రామంలో జడ్‌పి ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. అక్కడ మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం రుచికరంగా లేకపోవడాన్ని తప్పుబట్టారు. ఇలాంటి భోజనం పెడితే చర్యలు తప్పవని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో పాటు వంట మనిషి సుబ్బారెడ్డిలను హెచ్చరించారు. రుచికరంగా ఆహారం అందించాలన్నారు. అదే గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన గురుకుల పాఠశాల, జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి లోటూ రాకుండా చూడాలన్నారు. పౌష్టికాహారం అందించే విషయంలో లోపాలు తన దృష్టికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.